## పందొమ్మిదవ రోజు పారాయణము

### సప్తమాధ్యాయము

నారదుడు చెబుతున్నాడు: పృథు భూపాలా! కార్తీక వ్రతస్థుడైన పురుషుడు పాటించవలసిన నియమాలను చెబుతాను విను.

### కార్తీక వ్రతస్థులకు నియమములు

ఈ వ్రతస్థుడు - మాంసము, తేనె, రేగుపండ్లు, నల్లావాలు, ఉన్మాదకాలను భుజించకూడదు. పరాన్న భుక్తి - పరద్రోహం - దేశాటనలు త్యజించాలి. తీర్థయాత్రలు మాత్రం చేయవచ్చును. దేవ బ్రాహ్మ గురు రాజులును, స్త్రీలను, గోవ్రతస్థులను దూషించకూడదు. అవిసెనూనెను, నువ్వులనూనెను, విక్రయాన్నమును, నింద్యవ్యంజనే యుక్త భోజనమునూ, దూషితాహారమునూ విసర్జించాలి. ప్రాణి సంబంధిత మాంసచూర్ణాలనూ, ఆమ్ల సంబంధితాలైన నిమ్మకాయలు కొఱ్ఱల వంటి హీనధాన్యాలనూ, చద్ది అన్నాన్ని స్వీకరించకూడదు. మేక, గేదె, ఆవు- వీటి పాలు తప్ప మరే ఇతర ప్రాణుల ఆమిష సంబంధ క్షీరాలనూ స్వీకరించకూడదు. బ్రాహ్మణులచే అమ్మబడే రసాలను భూజాతలవణాలను విసర్జించాలి. రాగిపాత్రలలో వుంచిన పంచగవ్యం, చిన్న చిన్న గుంటలలో వుండే కుళ్ళు దైవానికి నివేదించబడని అన్నం - ఈ మూడూ మాంసతుల్యాలుగా చెప్పబడుతున్నాయి. గనుక వాటిని విసర్జించాలి. బ్రహ్మచర్యాన్నీ భూశయనాన్నీ పాటించాలి. ఆకులలోనే భోజనము చేయాలి. నాలుగవ ఝామున భుజించడమే శ్రేష్ఠం. ఈ కార్తీక వ్రతస్థుడు, ఒక్క నరక చతుర్దశినాడు తప్ప తక్కిన దీక్షా దినాలలో తైలాభ్యంగనం చేయకూడదు. విష్ణువ్రతం చేసేవారు - వంకాయ, గుమ్మడికాయ, వాకుడుకాయ, పుచ్చకాయలను విసర్జించాలి. బహిష్ఠలతోనూ, మ్లేచ్ఛులతోనూ, వ్రతభ్రష్టులతోనూ వేదత్యక్తులతోనూ సంభాషించ కూడదు. అటు వంటి వారి ఎంగిలికాని, కాకులు తాకిన ఆహారాన్నిగాని, ఆశ ఔచ సంబంధితాహారంగాని, ఒకసారి వండి మరల ఉడికించినది గాని, మాడు పట్టిన అన్నాన్ని గాని తినకూడదు. తన శక్తి కొలదీ విష్ణు ప్రీతికై కృచ్ఛ్రాదులను చేయాలి. గుమ్మడి, వాకుడు సురుగుడు, ముల్లంగి, మారేడు, ఉసిరిక, పుచ్చ, కొబ్బరికాయ, ఆనప, చేదు పొట్ల, రేగు, వంకాయ, ఉల్లి - వీటిని పాడ్యమి ఆదిగా పరిత్యజించాలి. కార్తీక మాసంలో కూడా ఉసిరికాయను తినకూడదు. ఇవేగాక, ఇంకా కొన్నింటిని కూడా వర్జించాలి. మరి కొన్నిటినీ బ్రహ్మార్పణం చేసి భుజించాలి.

ఈ కార్తీక మాసంలో చేసినట్లే, మాఘమాసంలో కూడా చేయాలి.

కార్తీక వ్రతాన్ని యధావిధిగా ఆచరించే భక్తులను చూసి - యమదూతలు సింహాన్ని చూసిన ఏనుగు వలె పారిపోతారు. వంద యజ్ఞాలు చేసిన వాడు కూడా స్వర్గాన్నే పొందుతున్నాడు. కాని కార్తీక వ్రతస్థుడు మాత్రం వైకుంఠాన్ని పొందుతున్నాడు. కాబట్టి - యజ్ఞ యాగాదుల కన్న కార్తీక వ్రతం గొప్పదని తెలుసుకోవాలి. ఓ రాజా భూలోకంలో వున్న పుణ్యక్షేత్రాలన్నీ కూడా, కార్తీక వ్రతస్థుని శరీరమందే వుంటాయి. విష్ణ్వాజ్ఞావశవర్తులైన ఇంద్రాదులందరూ, రాజును సేవకులు కొలిచినట్లుగా, ఈ వ్రతస్థుడినీ సేవిస్తారు. విష్ణు వ్రతాచరణపరులు ఎక్కడ పూజింపబడు తూంటారో, అక్కడి నుంచి గ్రహ, భూత పిశాచ గణాలు పలాయన మంత్రాన్ని పఠిస్తాయి. యధావిధిగా కార్తీక వ్రతం చేసే వారి పుణ్యాన్ని చెప్పడం చతుర్ముఖుడైన బ్రహ్మకు కూడా సాధ్యము కాదు. ఈ కార్తీక వ్రతాన్ని విడువకుండా ఆచరించేవాడు తీర్థయాత్రలు చేయవలసిన అవసరమే లేదు.

సప్తమోధ్యాయస్సమాప్త : (ఏడవ అధ్యాయము సమాప్తము)

## అష్టమాధ్యాయము

ప్రజారంజనశీలా! పృధునృపాలా! ఇక, ఈ కార్తీక వ్రతోద్యాపనా విధిని సంగ్రహంగా చెబుతున్నాను విను.

### ఉద్యాపనావిధి

విష్ణు ప్రీతి కోసమూ వ్రతసాఫల్యత కోసమూ - కార్తీకశుద్ధ చతుర్థశినాడు వ్రతస్థుడు ఉద్యాపనం చేయాలి. తులసిని స్థాపించి దాని చుట్టూ తోరణాలు గలది, నాలుగు ద్వారాలు కలదీ, పుష్ప వింజామరలచే అలంకరింపబడినదీయైన శుభప్రదమైన మండపాన్ని ఏర్పరచాలి. నాలుగు ద్వారాల వద్దా - సుశీల, పుణ్యశీల - జయ, విజయులనే నలుగురు ద్వారపాలకులను మట్టితో ఏర్పరచి - వారిని ప్రత్యేకంగా పూజించాలి. తులసి మొదట్లో నాలుగు రంగులు గల ముగ్గులతో 'సర్వతోభద్రం' అనే అలంకారాన్ని చేయాలి. దానిపై పంచరత్న సమన్వితము -నారికేళ సంయుక్తమూ అయిన కలశమును ప్రతిష్టించి - శంఖ చక్ర గదా పద్మధారీ పీతాంబరుడూ, లక్ష్మీసమేతుడూ అయిన నారాయణుని పూజించాలి. ఇంద్రాది దేవతలను ఆయా మండలాలలో అర్చించాలి. శ్రీ మహావిష్ణువు ద్వాదశి రోజున

నిద్రలేచి, త్రయోదశినాడు దేవతలకు దర్శనమిచ్చి, చతుర్దశినాడు పూజనీయుడై వుంటాడు కనుక, మానవుడు ఆ రోజున నిర్మలచిత్తుడై ఉపవాసముండి, విష్ణుపూజను విధివిధానంగా ఆచరించాలి.

గురువు ఆజ్ఞ ప్రకారం శ్రీహరిని సువర్ణరూపమందు ఆవాహన చేసి, షోడశోపచారాలతోనూ పూజించి, పంచభక్ష్య భోజ్యాలనూ నివేదించాలి. గీతవాద్యాది మంగళధ్వనులతో ఆ రాత్రి నుండి సేవించుచు మరునాడు ప్రాతఃకాలకృత్యాలు నెరవేర్చుకొని, నిత్యక్రియలను ఆచరించాలి. పిదప - నిష్కల్మషాంతరంగుడై హోమం చేసి, బ్రాహ్మణ సమారాధన చేసి, యధాశక్తి దక్షిణలు ఇవ్వాలి. ఈ విధంగా వైకుంఠ చతుర్దశినాడు ఉపవసించిన వాడూ, విష్ణుపూజ చేసిన వాడూ తప్పక వైకుంఠాన్నే పొందుతున్నాడు.

'ఓ బ్రాహ్మణులారా! మీరు సంతోషించుట చేత నేను విష్ణ్వనుగ్రహమును పొందెదను గాక! ఈ వ్రతాచరణ వలన - గత ఏడు జన్మలలోని నా పాపములు నశించును గాక! నా కోరికలు తీరునుగాక. గోత్రవృద్ధి స్థిరమగును గాక" అని బ్రాహ్మణులను క్షమాపణ కోరాలి.

వారి చేత 'తథాస్తు' అని దీవింపబడి - దేవతోద్వాసనలు చెప్పి, బంగారపు కొమ్ములతో అలంకరింపబడిన - గోవును గురువు దానమివ్వాలి. అటు తర్వాత - సజ్జనులతో కూడిన వాడై భోజనాదులు పూర్తి చేసుకోవాలి.

పందొమ్మిదవ (బహుళ చవితి) రోజు పారాయణము సమాప్తము